సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



గుట్టకు నిప్పు.. తోటకు ముప్పు

గుట్టకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో దాదాపు 200 ఎకరాల మామిడి తోటలు దగ్ధమయ్యాయి. - 8లో



అరుదైన ఆట.. ప్రతిభకు బాట

మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో విజయం సాధించి పతకాలు కైవసం చేసుకున్నారు. - 8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 183 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	683	727
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 443.78 కిలోలు

అన్నమయ్య జిల్లాలో వెలసిన రెడ్డెమ్మ కొండ ఆలయంలో భక్తులు మొక్కుబడిగా సమర్పించే తలనీలాలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంది. దాని ధర కూడా అదే స్థాయిలో ఉండటం విశేషం. తలనీలాలు సేకరించడంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇక్కడి నుంచి దిగుమతి చేసుకున్న వెంట్రుకలతో తయారు చేసిన తుది ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌లో భారీ ధరలకు చైనా విక్రయిస్తోంది.

ఆలయంలో అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



చెర్లోపల్లెలో వెలసిన సంతానదేవత రెడ్డెమ్మతల్లి ఆలయం



SAKSHI SPECIAL

- రెడ్డెమ్మ కొండ టు చైనా

సిరులొలికించే కురులు



- రెడ్డెమ్మ కొండ తలనీలాలు చైనా దేశానికి ఎగుమతి
- రికార్డు స్థాయిలో తలనీలాల వేలంపాట
- ఆలయ చరిత్రలో ఈ సారే అత్యధికం

గుర్రంకొండ: అన్నమయ్యజిల్లాలో సంతాన దేవతగా ప్రసిద్ధి పొందిన రెడ్డెమ్మ తల్లి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చైనాతో పాటు ఇతర దేశాలకు తలానీలాలను ఎగుమతి చేస్తుంటారు. గత ఏడాది అత్యధికంగా రూ. 26.24 లక్షలకు వేలం పాట పాడుకోగా ఈసారి ఆలయ చరిత్రలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో తలనీలాల వేలంపాట ధర రూ.27.01 లక్షలకు పాడుకోవడం గమనార్హం.

నాణ్యమైన తలనీలాలు

రాష్ట్రంలోని అన్ని దేవాలయాలతో పోల్చితే రెడ్డెమ్మకొండ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి ఆలయానికి వచ్చే భక్తులంతా ముఖ్యంగా సంతానం కోసం వచ్చేవారే. అందరూ 22 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు ఉన్న మహిళలే. ఇక్కడి ఆలయ పరిసరాల్లో పంపిణీ చేసే ఆకు పసరును సేవించి అమ్మవారి ఎదుట వర పడితే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. కోర్కెలు తీరిన మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి భక్తితో తలనీలాలు సమర్పిస్తుంటారు. అందరూ మధ్య వయస్సులో ఉన్న వారు కావడంతో వారి తలనీలాలు ఎంతో నాణ్యమైనవిగా ఉంటాయనేది వ్యాపారుల నమ్మకం.

విదేశాలకు ఎగుమతి

ఈ ఆలయంలో భక్తులు సమర్పించే తలానీలాలు ముఖ్యంగా చైనాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అన్ని దేవాలయాల్లో అన్ని వయస్సుల వారు స్వామి వార్లకు తలనీలాలు సమర్పిస్తుంటారు. అయితే ఇక్కడి ఆలయంలో ఎక్కువగా మహిళలు, యువకులు అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తుంటారు. దీంతో ఈ వయస్సు వారి తలనీలాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మిగిలిన ప్రాంతాల తలనీలాలతో పోల్చితే విదేశాల్లో రెడ్డెమ్మ కొండలోని తలనీలాలు ఎక్కువ ధర పలుకుతుంటాయి. దీంతో ఇక్కడి ఆలయంలోని తలనీలాలకు మంచి డిమాండ్ ఉంది.

కిలో తలనీలాలు రూ. 60 వేలు

ప్రస్తుతం తలనీలాలు కిలో ధర మార్కెట్లో రూ. 60వేలు వరకు పలుకుతోంది. గతంలో కిలో ధర రూ. 30 వేలు నుంచి రూ. 40వేల వరకు మాత్రమేఉండేది. అయితే తలనీలాలకు మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా మన దేశంతో పాటు విదేశాల్లోనూ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో వ్యా పారులు ఎగబడి తలనీలాల వేలం పాటలో పాల్గొనడం విశేషం.

రికార్డు స్థాయిలో వేలం పాటలు

ఆలయ చరిత్రలో ఎన్నడూలేని విధంగా తలనీలాల వేలం పాటలు రికార్డు స్థాయిలో పలికాయి. వారం రోజుల క్రితం జరిగిన వేలం పాటలో బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున తరలి రావడంతో పోటీ బాగా పెరిగింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, కర్నూలు, అనంతపురం, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు తరలి వచ్చారు. ఎలాగైనా వేలం పాట దక్కించుకోవాలనే ఉద్దేశంతో రికార్డు స్థాయిలో రూ. 27.01 లక్షలకు వేలం పాట పాడుకొన్నారు. గతంలో రూ. 10 నుంచి రూ. 12లక్షలు మాత్రమే తలనీలాల వేలం పాటలు పాడేవారు. గత రెండేళ్లుగా వరుసగా రూ.26.34లక్షలు, ప్రస్తుతం రూ.27.01లక్షలు వేలం పాట పాడుకోవడం విశేషం. విదేశాల్లో రెడ్డెమ్మకొండ తలనీలాలకు ఉన్న డిమాండే దీనికి కారణమని వ్యాపారులు చర్చించుకుంటుండటం విశేషం.

అధిక మొత్తంలో పాడుకున్నారు



ఈ ఏడాది తలనీలాలు ఎక్కువ మొత్తంలో వేలం పాట పాడుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వ్యాపారులు పోటీపడి వేలం పాటలో పాల్గొన్నారు. అమ్మవారి దయతో రికార్డు స్థాయిలో రూ. 27.01 లక్షలకు తలనీలాల కాంట్రాక్టు తీసుకొన్నారు. ఆలయ అభివృద్ధికి ఇది ఎంతో దోహద పడుతుంది. -మంజుల, రెడ్డెమ్మకొండ ఈఓ, చెర్లోపల్లె

తలనీలాలకు మంచి డిమాండ్



అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈమారు వేలం పాటలో నాలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొనడం ఇందుకు నిదర్శనం. మనదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా రెడ్డెమ్మకొండ తలనీలాలకు మంచి డిమాండ్ ఉంది. అందుకోసమే వ్యాపారులు పెద్ద మొత్తంలో వేలం పాటలు దక్కించుకొన్నారు.
- నరసింహారెడ్డి, ఆలయకమిటీ చైర్మన్, చెర్లోపల్లె

చరిత్రకు సాక్ష్యాలు..!

వందేళ్లకు పైబడిన ప్రభుత్వ భవనాలు

మదనపల్లె సిటీ: మదనపల్లెకు చరిత్రపుటల్లో చెక్కుచెదరని స్థానం ఉంది. క్రీ.శ. 1622లో ఏర్పడింది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సంస్కృతుల మేలుకలయికతో ప్రత్యేకతను చాటుకుంటోంది. చల్లని ప్రదేశం కావడంతో దీనికి పేదవాని ఊటీ, పెన్షనర్ల స్వర్గధామం అనే పేర్లు వచ్చాయి. ఎక్కడో ఉన్నవారు సైతం ఇక్కడ స్థిరపడ్డారు. 1800లో బ్రిటీష్ పాలన కిందకు వచ్చింది. అప్పటి నుంచి పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు బ్రిటీష్ పాలకులు నిర్మించారు. వందేళ్లకు పైబడినా భవనాలు చెక్కుచెదరడం లేదు. ఇప్పటికీ ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి.

వందేళ్లు పైబడిన ప్రభుత్వ కార్యాలయాలు


1800లో కడప జిల్లా కలెక్టర్ థామస్‌మన్రో వేసవి విడిది కోసం మదనపల్లెకు వచ్చారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో మొదట పూరిగుడిసెను నిర్మించారు. 1850లో మదనపల్లె సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. మొదటి సబ్ కలెక్టర్‌గా ఎల్‌బీ మనోలిని నియమించారు. దీంతో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. పురాతన భవనమైనా చూడటానికి ఎంతో ఆకర్షణీయణంగా ఉంది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో భవనాలు ఆధునికీకరణ చేసినా బ్రిటీష్ పాలకులు నిర్మించిన భవనాన్ని మాత్రం అలాగే ఉంచారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయాన్ని కూడా బ్రిటీష్ పాలకులు నిర్మించారు. అప్పట్లో చెరువులు, ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఈ కార్యాలయం నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం, చిత్తూరు రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం కూడా తెల్లదొరలు నిర్మించినవే.



మదనపల్లెలోని ఇరిగేషన్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం

తీపిగుర్తులు



మదనపల్లెలోని పాత కాలం నాటి ప్రభుత్వ భవనాలు తీపి గుర్తులు. ఎంతో చరిత్ర ఉన్న పట్టణంలో వందేళ్లకుపైబడిన భవనాలు ఇప్పటికి చెక్కుచెదరకపోవడం ఎంతో గర్వకారణం. ఈ భవనాలు మదనపల్లెకు కీర్తిని తెచ్చాయి.
-టీ.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా సోమవారం స్పందన నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

కేశాలు దానం చేసిన రిషిత



కేశాలను అందజేస్తున్న రిషిత

మదనపల్లె సిటీ: క్యాన్సర్ బాధితుల కోసం హెల్పింగ్‌మైండ్స్ చేపట్టిన హెయిర్‌డొనేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణానికి చెందిన రిషిత అనే విద్యార్థి కేశాలను సంస్థ వ్యవస్థాకుడు అబూబకర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 27 మంది స్వచ్ఛందంగా కేశాలు దానం చేసినట్లు తెలిపారు. వీటిని క్యాన్సర్ బాధితులకు అందజేస్తామన్నారు. విద్యార్థి రిషితకు పూలమొక్కను అందజేసి అభినందించారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకున్న డ్రైవర్లతో కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో ఆధ్వర్యంలో ఆసక్తి గల వారికి డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ డ్రైవింగ్ స్కూలులో 13 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా, 14వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవం గల రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చేత థియరీ క్లాసులు, 30 ఏళ్ల పాటు డ్రైవింగ్‌లో అనుభవం గల డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌చే ప్రాక్టికల్ క్లాసులు ఉంటాయన్నారు. వాహనం విడిభాగాలతోపాటు సిగ్నల్ బోర్డులు, ఘాట్‌రోడ్డు ప్రయాణం, యూటర్న్‌లో డ్రైవింగ్ విధానం తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 99592 25774, 73828 65145 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య శ్రీ సేవలు అమోఘం

కడప రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు అద్భుతంగా ఉన్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు.అసోసియేషన్ కడప శాఖ అధ్యక్షులు డాక్టర్ ఫరూక్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో ఇండియన్ మెడికల్ అసోషియేషన్ జోన్-3 స్టేట్ లీడర్స్ వర్క్‌షాప్ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రముఖ సంస్థల్లో ఐఎంఏ ఒకటని తెలిపారు. ఈ శాఖకు జాతీయంగా 1,750 బ్రాంచీలు ఉండగా అందులో 3.50 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 100 శాఖలు ఉన్నాయని, అందులో 20 వేల మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఐఎంఏలో ప్రైవేట్ వైద్యులే కాదని ప్రభుత్వ రంగ వైద్యులు కూడా ఉన్నారని అన్నారు. ఈ సంస్థ వైద్యుల పరిరక్షణకే గాక ప్రజా రోగ్యానికి ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు అమూల్యమైనవని తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంతో మంది పేదలు పునర్జన్మ పొందుతున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం 50 పడకల ఆసుత్రి అయితేనే ఆరోగ్య శ్రీ వర్తిస్తుందన్నారు. 25 పడకలు ఉన్నా కూడా ఆరోగ్య శ్రీని వర్తింప చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన నిబంధనలను సులభతరం చేయాలన్నారు. కాగా ఆపదలో వచ్చిన వారి ప్రాణాలను కాపాడలనేదే వైద్యుల ప్రయత్నమన్నారు. అనుకోని విధంగా పేషెంట్‌కు ఏదైనా జరిగితే వారి బంధువులు, వైద్యులు, ఆసుపత్రులపై దాడులు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం త్యాగరాజరెడ్డి, కడప శాఖ సెక్రటరీ డాక్టర్ వినమ్, సభ్యులు హేమలత, అశోక్, నాగమణి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

వైభవం.. సీతారాముల పౌర్ణమి కల్యాణం



స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణ దంపతులైన సీతారాములు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదికపై అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీ సమేతుడైన కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం జరిపారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉల్లాసం... ఉత్సాహం

- కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ పోటీ
- 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసిన ఎస్పీ జట్టు
- విన్నర్స్‌గా ఎస్పీ జట్టు, రన్నర్స్‌గా కలెక్టర్ జట్టు



ఇరు జట్ల సభ్యులతో జిల్లా కలెక్టర్, ఎస్పీలు



బ్యాటింగ్ అనంతరం రన్నింగ్ చేస్తున్న జిల్లా కలెక్టర్

రాయచోటి: నిత్యం పని ఒత్తిడితో తల మునకలైపోయిన అధికారులకు క్రికెట్ క్రీడ ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపింది. అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీ జట్లు వైఎస్సార్ జిల్లా కడప వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో ఆదివారం క్రీడా పోరాటాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాపీఎస్, ఎస్పీ హర్షవర్ధన్ రాజులు అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరపున క్రికెట్ కిట్స్, 50 మంది క్రీడాకారులకు క్రికెట్ యూనిఫామ్ అందజేయడం శుభపరిణామమన్నారు.

టాస్ గెలిచి..

ఈ కార్యక్రమానికి ముందు ఎస్పీ టీమ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఇందులో కలెక్టర్ టీమ్‌కు కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ టీమ్‌కు ఎస్పీ హర్షవర్ధన్ రాజు కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ క్రికెట్ మ్యాచ్ రెండు జట్లమధ్య హోరాహోరీగా ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగింది. తొలుత ఎస్పీ టీమ్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు సాధించగా, 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కలెక్టర్ టీమ్ 151 పరుగులు చేసి 19.5 ఓవర్లలో ఆలౌట్ అయింది. జిల్లా కలెక్టర్ 3 పరుగులు, ఎస్పీ 5 పరుగులు చేసి క్రీడాకారులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఎస్పీ టీమ్‌కు చెందిన శ్రీనివాస్ 66 పరుగులు తీసి, 2 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా కలెక్టర్ టీమ్‌కు చెందిన పెంచలయ్య 5 ఫోర్లు, ఒక సిక్స్ మొత్తం 38 పరుగులతో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచారు. అలాగే బెస్ట్ బౌలర్‌గా హేమంత్ రెడ్డి నిలిచారు. ఈ మ్యాచ్‌లో ఇన్‌స్పైరింగ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, బెస్ట్ కెప్టెన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎస్పీ హర్షవర్ధన్ రాజు నిలిచారు. విన్నర్స్‌గా ఎస్పీ టీమ్, రన్నర్స్‌గా కలెక్టర్ టీమ్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంటు భరత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, పక్కన ఎస్పీ



టాస్ వేస్తున్న క్రికెట్ సంఘం అధ్యక్షుడు భరత్‌రెడ్డి





బ్యాటింగ్ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టిక్ నిషేధం



శ్రీ నిత్యపూజ స్వామి సన్నిధిలో కడప డీఎఫ్‌ఓ వెంకట సందీప్‌రెడ్డి

సిద్ధవటం: మహాశివరాత్రి ఉత్సవాల్లో శ్రీ నిత్యపూజ స్వామి కోనలో అన్నదాన కార్యక్రమాలకు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్ల వాడకాన్ని నిషేంధించాలని కడప డీఎఫ్ఓ వెంకట సందీప్‌రెడ్డి అటవీ అధికారులకు ఆదేశించారు. సిద్ధవటం మండలం లోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు.ఆలయ చైర్మన్ కొండారెడ్డి ఆయ నను సన్మానించారు. అనంతరం ఆయన లంకమల అడవుల్లో అటవీశాఖ చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని , ఆర్టీసీ బస్సులు నిలుపు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన సిద్ధవటం రేంజి లోని కొండూరు బీటులోని కలివికోడి ఆవాస ప్రాంతమైన మచ్చాయ కుంట ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సిద్ధవటం రేంజర్ ప్రసాద్, డిప్యూటీ రేంజర్ ఓబులేస్, బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిప్స్ ప్యాకెట్ కోసం.. క్యాంటీన్ యజమానిపై దాడి

కలికిరి : సినిమా థియేటర్‌లో చిప్స్ ప్యాకెట్ కోసం క్యాంటీన్ యజమానిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రసాద్ థియేటర్‌లో గురువారం రాత్రి సెకండ్ షో ముగిసిన తరువాత పట్టణానికి చెందిన మహమ్మద్ షామీర్ మద్యం మత్తులో చిప్స్ కోసం క్యాంటీన్ తలుపులు తన్ని, దౌర్జన్యంగా లోపలికి వెళ్లాడు. అడ్డుకోబోయిన యజమాని వేమారెడ్డిపై దాడి చేసి చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు ఆదివారం బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ మధుసూధనాచారి కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఒరిగిన విద్యుత్ స్తంభం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లె–పందిళ్ళపల్లె మార్గమధ్యంలో మద్దిరేవుల గ్రామం మార్లవాండ్లపల్లెలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పందిళ్ళపల్లి నుంచి లక్కిరెడ్డిపల్లి వైపు వెళ్తున్న కారు మార్లవాండ్లపల్లె సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం ఒరిగిపోవడంతో సమీపంలోని సబ్‌స్టేషన్ వారికి స్థానికులు ఫోన్ చేయడంతో సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి ఎటువంటి అపాయం జరుగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాన్ని సరి చేశారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మృతి చెందిన పెంచలయ్య

పెనగలూరు : పెనగలూరులో విద్యుత్ షాక్‌తో ఆదివారం ఓ రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ హేమాద్రి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈరి పెంచలయ్య (47) తెల్లవారుజామున నీరు పట్టేందుకు పొలానికి వెళ్లాడు. మోటారు వేస్తుండగా స్టాటర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వరి పంటలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం వరకు పెంచలయ్య రాకపోవడంతో ఆయన భార్య లక్ష్మీదేవి పొలం వద్దకు వెళ్లి చూసింది. విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అరుదైన ఆట.. ప్రతిభకు బాట



రోప్ స్కిప్పింగ్ ఆడుతున్న క్రీడాకారులు



రోప్‌స్కిప్పింగ్‌లో ప్రతిభ కనబరచిన జెడ్పీ పాఠశాల విద్యార్థులు

జాతీయ స్థాయిలో రోప్‌స్కిప్పింగ్‌లో రాణిస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : రోప్ స్కిప్పింగ్ ఇదొక అరుదైన క్రీడ. ఇలాంటి ఆటపై ఆసక్తి పెంచుకుంటున్నారు మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో రాణిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటి పతకాలు సాధించారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విజయం సాధించి పతకాలు కైవసం చేసుకున్నారు.

రెండేళ్ల నుంచి..

రోప్ స్కిప్పింగ్ ఆటను రెండేళ్ల క్రితం పాఠశాలలో ప్రవేశ పెట్టారు. కొత్త క్రీడ కావడంతో వైజాగ్‌కు చెందిన కోచ్ సాగర్‌ను పీడీ సుధాకర్ పాఠశాలకు రప్పించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. దీంతో విద్యార్థులు ఆటపై ఆకర్షితులయ్యారు. అప్పటి నుంచి పాఠశాలలో సుమారు 30 మంది వరకు రోప్ స్కిప్పింగ్‌లో రాణిస్తున్నారు. ఇదే పాఠశాలలో దీంతోపాటు ఫుట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, హాకీ, అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు.

రివ్వున దూసుకెళ్తున్న రిహాన్



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రిహాన్ 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు నూరుల్లా, నీలూఫర్. చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తితో రాణిస్తున్నారు. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు సత్తెనపల్లిలో బంగారు, కర్నూలులో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

జశ్వంత్ జయభేరి



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జశ్వంత్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు శ్రీనివాసులు, చంద్రకళ, తండ్రి బిల్డర్. క్రీడలపై మక్కువతో పలు ఆటల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మధ్యప్రదేశ్ భోపాల్‌లో గోల్డ్‌మెడల్, గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, భీమవరంలో రజత పతకం సాధించారు. జిల్లా స్థాయిలో 15 పతకాలు సాధించారు.

పతకాల వీరుడు అఖిల్



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్.అఖిల్‌నాయుడు 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు మధుకర్, శిరీష. తండ్రి ఆటో డ్రైవర్. చిన్నప్పటి నుంచి అఖిల్‌కు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణించి పతకాలు సాధిస్తున్నాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయిలో రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని సిల్వర్, మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో రాణించాలన్నదే తన ఆశయమని అఖిల్‌నాయుడు చెబుతున్నారు.

రాణిస్తున్న రమ్య



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రమ్య 8వ తరగతి చదువుతోంది. చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోంది. తల్లిదండ్రులు నాగార్జునరెడ్డి, సరళ. తండ్రి దినసరి కూలీ. ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ సలహాలు, సూచనలతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణిస్తోంది. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించింది. రాష్ట్ర స్థాయిలో కర్నూలు, గుంటూరు, భీమవరంలో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. పీడీ సుధాకర్ సహకారంతో క్రీడల్లో మంచి పేరు సాధిస్తానని రమ్య చెబుతోంది.

క్రీడల్లో వికసిస్తున్న ఉష



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉష 9వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు రమేష్, స్వర్ణలత. తండ్రి రైతు. చదువుతోపాటు క్రీడల్లో చురుగ్గా ఉండటంతో పీడీ సుధాకర్ గుర్తించి ప్రోత్సహించారు. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు, గుంటూరు, భీమవరంలో జరిగిన పోటీల్లో కాంస్య పతకాలు సాధించింది.

పొలం దారి విషయమై దాడి



గాయపడ్డ నీలాంద్రరెడ్డి

గాలివీడు : మండలంలోని పందికుంట దేవరపల్లి గ్రామంలో నీలాంద్రరెడ్డి (55)పై పొలాలకు వెళ్లే దారి వివాదం విషయమై ఆదివారం దాయాదులు దాడి చేశారు. ఈ సంఘటనలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రిమ్స్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట శివప్రసాద్ తెలిపారు.

శాప్ లీగ్ పోటీల్లో రెండో స్థానం



జిల్లా హాకీ జట్టు

కడప స్పోర్ట్స్ : కాకినాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్–2 పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు రెండోస్థానంలో నిలిచింది. జిల్లా జట్టు రెండో స్థానంలో నిలవడంపై స్టెప్ సీఈఓ సి. సాయి గ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ అభినందించారు. జిల్లా జట్టు వెంట హాకీ శిక్షకులు అనిల్, ఖాదర్‌బాషా, రవి, జానీ వెంట ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం గౌతమినగర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలయ్యారు. గౌతమినగర్‌కు చెందిన అక్రమ్(30) అతని భార్య హుస్సేన్‌బీ(26), కుమారుడు మహమ్మద్ షాహీర్(6)లు ద్విచక్రవాహనంలో కదిరి రోడ్డు టిప్పు సుల్తాన్ మైదానం వద్దనున్న దుస్తుల దుకాణానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళుతుండగా సంఘం ఫంక్షన్ హాలు సమీపంలో వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కుటుంబ సభ్యులు ముగ్గురూ గాయపడ్డారు. వారిని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి వరికోత మిషన్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రౌతుకుంట పంచాయతీ బోయపల్లెకు చెందిన వెంకటేష్ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. దేవపట్ల మిట్టవద్దకు రాగానే అదుపు తప్పి వరికోత మిషన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వెంకటేశ్‌ను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎగువ భద్ర ప్రాజెక్టుతో సీమకు అన్యాయం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఎర్రగుంట్ల : కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించి ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం వల్ల రాయలసీమ రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని, ఈ ప్రాంతం ఏడారిగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, కె.ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎర్రగుంట్ల పట్టణంలోని మార్క్స్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర నది మీదుగా డ్యామ్‌కు పైభాగంలో ఎగువ భద్ర అనే ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. దీని ఫలితంగా తుంగభద్ర డ్యామ్ నుంచి మొదటి దశలో 17.4 టీఎంసీలు, రెండవ దశలో 29.9 టీఎంసీలు నీటిని ఎగువ ప్రాంతానికి తరలించడం వల్ల.. తుంగభద్ర డ్యామ్‌కు దిగువ ప్రాంతంలో ఉన్న ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, పోతిరెడ్డిపాడు, రాజోలు బండ డైవర్షన్ స్కీం ప్రాజెక్టులకు నీరు అందక రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందన్నారు. దిగువ ప్రాంతంలో దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టు నీరు అందక రైతులు నష్టపోతారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేందుకే కర్ణాటక రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందన్నారు. దీనిపై రైతు సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఆదోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భవాని శంకర్, ఏఐటీయూసీ నాయకులు రాధాక్రిష్ణ, ఓబుళరెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తులకు శాశ్వత కీర్తి కల్పిద్దాం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లయన్ మానస కె.చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : తమ జీవితాలను దేశం, ప్రజలు, సమాజం కోసం అంకితం చేసిన ధన్యుజీవులైన గొప్ప వ్యక్తులకు శాశ్వతకీర్తి కల్పించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వక్తలు పేర్కొన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, యోగి వేమన విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేసే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస కె.చిన్నపరెడ్డి కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ రాయలసీమకు గర్వకారణంగా నిలిచిన ముగ్గురు గొప్ప వ్యక్తుల కృషికి శాశ్వత కీర్తి కల్పించేందుకు విగ్రహాల ఏర్పాటు ఓ మార్గమని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తుల శౌర్య, దాన, సామాజిక చింతనలను భావి తరాలకు తెలియజేసేందుకు ఇది ఉత్తమమైన పద్ధతిగా భావిస్తున్నామన్నారు. వారి విగ్రహాల ఏర్పాటుకు అందరూ కలిసి రావాలని కోరారు. కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, బాలస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, 23వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి మాట్లాడుతూ నగరంలో ఆ ముగ్గురి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి కోసం కార్పొరేషన్ సమావేశం దృష్టికి తెస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఇందుకు అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసి పనులు సజావుగా సాగేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ వేమన విగ్రహం ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతి కూడా ఇచ్చిందన్నారు. ఆ తర్వాత అభ్యంతరాలతో పనులు ముందుకు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవత సంస్థ ప్రతినిధులు డాక్టర్ రామాంజులరెడ్డి, రాటాల గోపి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెంచురెడ్డి, కె.సురేష్‌బాబు మాట్లాడుతూ వై–జంక్షన్‌లో గానీ, రాజీవ్‌మార్గ్‌లో గానీ లేదా నగరంలోని ముఖ్య కూడళ్లలో వీలున్న చోట ఆ మహా పురుషుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, కోదండ రామస్వామి ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, భూపతిరాయల్, బాసట బాలాజీరావు, సుబ్బారెడ్డి మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు ఉత్తమ కార్యక్రమమని, వాటిని ఏర్పాటు చేసేందుకు అనువైన చోట్లను సూచించారు. వైవీయూ చిత్రకళా ఫ్యాకల్టీ మనోహర్ మాట్లాడుతూ విగ్రహాల తయారీలో యూనివర్సిటీ కళాకారుల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ వీలైనంత త్వరలో కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టగలమన్నారు. 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ తుమ్మలూరు సురేష్, కేవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. స్థానిక సింహపురి కాలనీలో నివాసం వుంటున్న ముత్తుకూరు రమాదేవి(55) తన కుమార్తె హిమజతో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వదిలి పెట్టడానికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె రోడ్డు దాటుతుండగా రాజంపేట వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



మృతి చెందిన నారాయణ

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే.. వీరపునాయునిపల్లె నుంచి జెర్రి నారాయణ(50), మాకం గంగన్న అనిమెలకు, అనిమెల నుంచి వీరపునాయునిపల్లెకు మాకం మంజునాథ వస్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయాల పాలయ్యారు. వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జెర్రి నారాయణ(50) మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం మాకం గంగన్నను కడప రిమ్స్‌కు, మాకం మంజునాథను తిరుపతికి తీసుకెళ్లారు. వీరి ముగ్గురిదీ అనిమెల గ్రామం. నారాయణకు ముగ్గురు కుమార్తెలు కాగా వారిలో ఇద్దరికి వివాహం అయింది.

యువతి ఆత్మహత్య



మృతి చెందిన శిరీష

పీలేరు రూరల్ : ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రేగళ్లు పంచాయతీ బోయపల్లెలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. బోయపల్లెకు చెందిన బాబు, మనెమ్మ కుమార్తె డి.శిరీష (21) రెండు రోజులుగా కడుపు నొప్పి తాళలేక ఆదివారం తెల్లవారుజామున ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మతి స్థిమితం లేని వ్యక్తి..

గాలివీడు : మండలంలోని నూలివీడు గ్రామం ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన ఎన్. వెంకటరమణారెడ్డి (70) మతిస్థిమితం సరిగా లేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది విష ద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడిని కుటుంబ సభ్యులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటశివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం నలుగురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం వాల్మీకివీధికి చెందిన అదెప్ప అలియాస్ ఆదినారాయణ(65) అనారోగ్యాన్ని భరించలేక పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె రూరల్ మండలం కోటవారిపల్లె పంచాయతీ పాకాలవారిపల్లెకు చెందిన గంగాధర్(32) కుటుంబ విషయమై భార్య అంబికతో గొడవపడ్డాడు. ఆయన ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ములకలచెరువు మండలం ఆవులవారిపల్లెకు చెందిన మౌనిక(25) కుటుంబ కలహాలతో ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె రూరల్ చీకలబైలుకు చెందిన డిగ్రీ విద్యార్థిని (18) ఇంట్లో ఏ పని చేయడం లేదని కుటుంబ సభ్యులు మందలించడంతో.. ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుట్టకు నిప్పు.. తోటకు ముప్పు



తూముగుంట ప్రాంతంలో కాలిపోయిన మామిడి తోటలు

- మామిడి తోటలు దగ్ధం
- కొండల్లోని చెట్లు, గడ్డి కాలిపోయిన వైనం



ముచ్చుకోన ప్రాంతంలో గుట్టలో వ్యాపిస్తున్న మంటలు

గుర్రంకొండ : గుట్టకు ఆకతాయిలు పెట్టిన నిప్పు పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది. దాదాపు 200 ఎకరాల మామిడి తోటలు దగ్ధమయ్యాయి. కొండల్లోని చెట్లు, గడ్డి కాలిపోయి బూడిదయ్యాయి. ఈ సంఘటన గుర్రంకొండ పంచాయతీ పరిధిలోని తూముగుంట, ముచ్చుకోన ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తూముగుంట, ముచ్చుకోన, జీవన్‌తోపు ప్రాంతాల పరిధిలో ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు గుట్టలకు నిప్పు అంటించారు. దీంతో మంటలు దావానలంలా వ్యాపించి కొండలు, గుట్టలతోపాటు సమీప తోటల వైపు దుసుకొచ్చాయి. ఒక్కసారిగా తోటల్లో వ్యాపించాయి. గంటల తరబడి ఎకరాల భూములు, కొండలు, గుట్టల్లో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడ్డాయి. తోటల్లో మామిడి చెట్లు కాలిపోయాయి. ఉద్యావన తోటల్లో రైతులు అమర్చిన పైపులైన్లు కాలిబూడిదయ్యాయి. కొండలు, గుట్టల్లో అడవి జంతువులు, పక్షులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రాంతానికి వాహనాలు వెళ్లే దారి లేకపోవడంతో ఫైరింజన్ కూడా రాలేదు. దీంతో రైతులు మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.